నాగమణి చదువు

మల్లెపువ్వులు కోసి మాలకట్టి సరస్వతీదేవి పటానికి అలంకరించి, భక్తితో నమస్కరించింది నాగమణి. 'పేపర్ సార్,' అంటూ వీధిలో కేక వినిపించింది. మణి వీధిలోకెళ్లి పేపరుతెచ్చి మేజామీద పెట్టి కుర్చీదగ్గరగా లాగి, కూర్చుని దినపత్రిక చూసింది.

గడ్డిపాడులో గరల్స్ హైస్కూల్ నిర్మించడానికి 40 వేల రూపాయిలు విరాళం ఇవ్వబడిందనీ, స్కూలు అర్థభాగం పూర్తయిందనీ, రెండుమాసాలలో పూర్తికావచ్చనీ, పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాసివుంది. ఇది చదవగానే ప్రతిరోజూ ఇంట్లో తన చదువు విషయమై, జరిగే ఘర్షణ గుర్తుకొచ్చింది మణికి. పేపరుతీసి దూరంగా పెట్టేసింది. స్త్రీలు విద్యావంతులు కావాలని గరల్స్‌స్కూల్స్ స్థాపిస్తున్నారు. కాని తన నాయనమ్మవంటివారుంటే బాలికలు ఎలా వృద్ధిలోకి వస్తారు?

గడియారం చూసింది. స్కూలుకు టైమవుతోంది. డ్రాయరుతీసి టైమ్‌టేబుల్ చూసి, లెక్కలు, జాగ్రఫీ, ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలు తీసి మేజామీద పెట్టి, తెలుగునోట్సు చదవాలని తెరిచింది. హోమ్‌వర్క్ లెక్కలు గుర్తుకొచ్చాయి, నోట్సు మూసి లెక్కలపుస్తకం తెరిచి లెక్కలువేస్తోంది. చెల్లెలు "భారతి" ఏడుస్తోంది. లెక్కలుచేసి ఎత్తుకోవచ్చనుకొంటూ ఊరుకుంది మణి, కలం కాగితంమీద వుందేకాని మనసంతా భారతి ఏడ్పుమీదే వుంది. మళ్ళీగోల వస్తుందేమో అన్నట్లు చేసేస్తోంది లెక్కలు.

"అక్కా, లెక్క చేసి పెట్టవ్" అంటూ వచ్చాడు మురళి.

"నా లెక్కలే చెయ్యలేదిప్పటికి, నీలెక్కలేం చేసిపెట్టనురా"

"మా మేష్టారు కొడతారే ఒక్క లెక్కే గదా. ఎంతసేపు చెయ్యాలే, నా ఒక లెక్క చేసి తర్వాత నీయిష్టం వచ్చినంతసేపు చేసుకోరాదూ!"

"నాకిప్పుడు తీరదురా మురళీ" విసుపుగా అంది మణి.

"చేసిపెట్టవ్ కదూ, సరేలే," కోపంగా చూస్తూ వెళ్లిపొయ్యాడు మురళి. "అక్కయ్యచూడవే ఒక్క లెక్కచేసి పెట్టమంటే చేసిపెట్టడంలేదే నాయనమ్మా, తీరదుట" కోపంలో చెప్పేశాడు మురళి.

మణిలెక్కలు పూర్తిచేసి బుక్స్‌సర్ది టేబుల్‌మీద పెట్టి టైమవుతోందని, త్వరగా జడ వేసుకుని మురళి ఏమి చెప్తాడో అన్న భయంతో కిటికీలోంచి తొంగి చూసింది. ఎత్తేనే ఎత్తింది ఎప్పటిగోల, ఎప్పుడు వీలవుతుందా అని చూసే మంగమ్మకు సమయం దొరికితే వదుల్తుందా?

"ఆ, అదెక్కడ చేస్తుందిరా? దాని షోకులు, దాని ఠీవి అబ్బో, జడవేసుకుని సింగారించుకొని, వయ్యారంగా ఆ పుస్తకాలు చంకనేసుకుని బడికెళ్లమంటే, నాకంటే మించినవాళ్ళు లేరన్నట్లుగా పోతుంది. చిన్నపిల్ల ఏడుస్తోంటే దానికేమైనా వినిపిస్తోందా? ఆ పుస్తకాలు ముందు పెట్టుకుని ఎవరిగోల పట్టనట్టు రాశేస్తోంటుంది. ఏమిటో ఆ బ్రహ్మరాత! పనిచెయ్యకపొయ్యినా పిల్లనే నా కాస్త చూడొద్దూ, ఎంత గారాలకూతురైతేమాత్రం? మీ నాన్న చేస్తున్నాడు లేరా, దానికింకేం చదువు, మాన్పించమంటే, ఇక ఒక్కఏడు చదివితే స్కూల్ ఫైనల్ పూర్తవుతుంది, ఏం మించిపోతేదులే అంటాడాయె. ఇంటిదగ్గరవుంటే కదా నే చెప్పడానికి. ప్రొద్దున్నే బడికెళ్ళడం, సాయంత్రం రావడం, అన్నీ రెడీచేసి పెడితే అమ్మగారు భోంచేయడం. ఆ పుస్తకాలు తిరగేస్తూ కూర్చోడం, తీరికెలా వుంటుంది? ఆబడి మానేస్తే అప్పుడు చెబుదును దానిపని. మా కాలంలో దీనంత అయేటప్పటికి, పెండ్లయి, ఇంట్లో పనంతా రాత్రనక, పగలనక చేసేవాళ్ళం. ఆ యెయ్యా రాత. అన్నీ మారిపొయ్యాయిలే. కాబట్టే కాలంకూడ ఇలా కరువు కొట్టుకుని ఏడుస్తోంది. ఆ స్కూళ్ళకు జీతాలు కట్టడానికే చాలదు వున్న డబ్బు. రెండురోజులకొకసారి, పుస్తకాలూ, పెన్నులూ, సిరాలూ కొనాలాయె. మీ నాన్న అడిగినవన్నీ లేదనకుండా తెచ్చిపెడ్తాడు. మనమంటే దానికి అంత చిరాకు అందుకే. చదివి వెలగబెడ్తుందిలే చూదాంగా. పని చేతకాదు సరికదా, ఇంట్లో మొగబిడ్డ చదువుకూడా పోతోంది. నీకా పాఠాలు చెప్పడానికి తీరికేదీ? దాన్ని చదువు మాన్పిస్తేనే గాని, నీకు చదువురాదురా, నే చెప్తున్నాగా! అయినా, నే నెవరిని చెప్పడానికి, నీకేం తెలియదు నువ్వూరుకో మంటాడు మీనాన్న. ప్రొద్దస్తమానమూ చదువే దీని దుంపతెగా. చెముడొచ్చిందా ఏమే? మాట్లాడవేం, భారతి నొక్కమాటు ఎత్తుకో. నేను పూజ చేసుకోవాలి. మీ అమ్మకు వంటకాలేదు"

తన అక్కసునంతా వెళ్ళపోసింది మంగమ్మ. క్రూరంగా చూస్తూ మణిచేతికి భారతినిచ్చి, "ఇకనేనా ఆ పుస్తకాలక్కడపెట్టి కాస్త ఎత్తుకో అమ్మా ఏమి అరిగిపోవు. చదివి తర్వాత వెలగబెట్టొచ్చులే".

విసురుగా వెళ్లిపోయింది మంగమ్మ. ఈ పురాణం వినలేక విసుగుతో వెళ్లిపొయ్యాడు మురళి. మణికి గజందూరంలో పిడుగుపడి నట్లయింది. మనసులో ఆవేదన ఎక్కువైంది. పత్రికలో చూసిన విషయం మనసులో కదిలింది.

మణిహృదయం కలతచెందింది. పూర్వానికీ, ఇప్పటికీ వత్యాసం ఉండకూడదని నాయనమ్మ పటుదలై వుండాలి. స్త్రీ విద్య నేర్వకూడదా? ఈ స్కూళ్ళన్నీ ఎందుకు? అందరూ ఇలాగే బాధపడ్తారా? తన కెప్పుడూ చదువుమీద వున్న దృష్టి ఇక దేనిమీదా లేనిమాట నిజమే. అందుకేనా తన్నిట్లా బాధపెట్టడం? ఏదో ఒక తప్పు పడుతుంది. తనేం చెయ్యాలి? స్కూల్లో బాగా చదవాలన్న మాట ఇంటికివస్తే మరచిపోవాలి. ఇంట్లో పనులు చేయాలి అన్న మాట స్కూలుకెడితే మరచిపోవాలి. ఇంతేనా? మణి హృదయంలో అన్నీ ప్రశ్నార్థకంగా మెదిలాయి. ఈగోల పోవాలంటే చదువు మానేయాలి "అయ్యో!" చిన్నగా మూలిగింది మణి.

చేతుల్లోంచి భారతి టేబుల్‌మీదికి జారిపోయింది. మణి కుర్చీలో వొరిగిపోయింది. భారతి బొమ్మల పుస్తకాలు చూసి, సంతోషంతో నవ్వి పుస్తకాలన్నీ విసిరికొడ్తోంది. టిక్ టిక్‌మని గడియారం చప్పుడు పసిహృదయానికి సంతోషాన్నిచ్చింది. గడియారం చేతుల్లోకి తీసుకుని,

మణి పుస్తకాలు తీసుకోపోయింది. "చదువుమానేస్తున్నావు. మాతో నీకేమవసరం?" అని అవి అంటున్నట్లు కన్పించాయి.

నవ్వుతూ పైకెత్తబోయేసరికి జారి మణిమీద పడిపోయింది. మణి ఉలిక్కిపడి గడియారం టేబుల్ మీద పెట్టి, క్రిందపడివున్న పుస్తకాలన్నీ తీసి కిటికీలో పెట్టింది. భారతిని టేబుల్ మీది నుంచి క్రిందికిదించేసరికి, అది పెద్దగా ఏడ్వడం సాగించింది. మణి ఎత్తుకున్నా, పుస్తకాలు చూపిస్తూ ఏడుస్తూనే వుంది.

మంగమ్మ పూజ చాలించి, నరసింహావతారమెత్తి, చరచర మణిచేతుల్లోంచి భారతిని లాక్కుంది. భారతి పుస్తకాలు చూపిస్తూ ఇంకా హెచ్చుస్థాయిలో ఏడుస్తోంది. "ఆ పుస్తకాలిందాక టేబుల్ మీద వున్నాయిగా, కిటికీలో కెలా వచ్చాయి? పుస్తకాలు తీసికొంటూంటే లాక్కుని వుంటావు. చూడు చంటిదాని చేతు లెలా కమిలిపోయాయో! నాకు తెలుసు నివ్వేదో వక ఘనకార్యం చేస్తావని. గిల్లేనా ఏడ్పించవూ! నువ్వేమైనా తక్కువదానివా? అంతులేని ఆవేశంతో అంది మంగమ్మ.

"అదికాదు నాయనమ్మా పుస్తకాలన్నీ విసిరికొట్టూంటే, తీసి కిటికీలో పెట్టాను." జంకుతూ చెప్పింది మణి.

"అలా చెప్పు, చిన్నపిల్లను కూర్చోబెడుతున్నాం కదా, పుస్తకాలక్కడవుంటే తెలియక చించేస్తుందని తెలియదూ? నీకేంలే! మహారాజు! మీనాన్న పాతవిపోతే కొత్తవి తెస్తాడు. ఆ పుస్తకాలు డ్రాయరులో పెట్టుకోకూడదూ, టేబుల్ మీద పెట్టకపోతే? దాన్నేడిపించాలనీ నీయెత్తు! అవునా?" ఇష్టమొచ్చినట్లు తిట్టిపోస్తోంది మంగమ్మ.

మణి కుమిలిపోయింది, జవాబేమి చెప్పాలో అర్థంకాలేదు. నాయనమ్మ ఊరుకోదు, ఎనిమిదిన్నరయింది. స్కూలుకు టైమవుతోంది

"స్కూలుకు పోవడానికి పుస్తకాలు టేబుల్ మీద పెట్టాను." అప్రయత్నంగా అనేసింది మణి.

మంగమ్మకు కోప మెక్కువయింది. "జవాబు చెప్పేంతదానివయ్యావుటే? ఆ స్కూలొకటి దాపురించింది నీకు. ఆ పుస్తకాలు చదివి పాసుకాకపోతే ఫరవాలేదులే." ఫైలైతే నేనా మణి చదువు మాన్పిస్తారని మంగమ్మ ఆశ.

"అలాగేఅంటారు, ఫైలైతేడబ్బుకుడబ్బూపోయి,పనికి పనీపోయి ఫైలైపోయావుటే అనిమీరేఅంటారు." మొండిధైర్యం తెచ్చుకుని అంది మణి.

"ఏమిటే నీ పెళసరపు మాటలు, నీ పెళసరం నాదగ్గర చూపకు, ఎవరిదగ్గర నీ ఆటలు సాగుతాయో వాళ్ళదగ్గర ఆడు. అసలు నీకు భయమూ, భక్తీ అంటూవుంటే కదా? నోరుకి కూడా కొంత అదుపూ, అజ్ఞ వుండాలి. నాకేం అడ్డు లేదని, నీ యిష్టం వచ్చినట్లు మాట్లాడితే పడేవాళ్ళెవరూ లేరు. వాడి కొక లెక్క చెప్పమన్నాను కాని నీతో వాదానికి రాలేదు. నే నేదో అన్నట్లు పోట్లాట కొస్తున్నావే? నాకు బుద్ధులు చెప్పొచ్చావా? ఇక ఫరవాలేదమ్మా. ఏదో సామెత చెప్పినట్లుంది, ముందొచ్చిన చెవులను, వెనుకొచ్చిన కొమ్ములు వెక్కిరించాయట. పెద్దదాన్ని చెప్పాననుకోక, నాకు నీతులం గరపబోతోంది. ఆహా! ఈ కాలంవాళ్ళకు ఏం తెలివి! పుస్తకాలు చదివి పుట్టెడు బుద్ధులు నేర్చుకొన్నారు, అంతకన్నా ఇంకేం కావాలి!" వెటకారంగా అంది మంగమ్మ.

మణి ఎత్తిపొడుపుల్ని సహించలేకపోయింది. ఏదో అనబోయేసరికి, మొన్న మేష్టారమ్మ క్లాసులో చెప్పిన మాటలు, టకీమని జ్ఞాపకానికి వచ్చాయి. ప్రతి ఒక్కరికీ ఓర్పు ఉండాలి. ఓర్పు లేకపోతే జీవితరేఖ వంకర తిరుగుతుంది. కోపంగా వున్నవారి జీవితం ఎప్పుడూ సుఖవంతం కానేరదు. ఎంతటి కష్టాలలోనైనా, ఓరిమి, శాంతి అవసరం. మణి అనబోయే మాటమ్రింగేసింది. నాయనమ్మ పలికిన ప్రతివక్కమాట ములుకులాగ్రుచ్చుకుంది. ఓర్పుతో వాటిని తీసెయ్యాలి. మనసువాటిని వదలడం లేదే? ఏం చెయ్యాలి? దీనంగా మంగమ్మ కళ్ళలోకి చూసింది. కొరకొర చూస్తూ వెళ్ళిపోయింది మంగమ్మ. జాలికూడా లేదు.

గాలి జోరుగా కొట్టోంది. జుట్టు రేగి కళ్ళలో పడుతోంది కిటికీ తలుపు టక్కుమని కొట్టుకుంది. పుస్తకాలన్నీ ఎగిరిపడిపోయాయి. మణి ఆలోచనకు అంతరాయం కలిగింది. పడిపోయిన పుస్తకాలన్నిటినీ తీసి టేబుల్ మీదపెట్టి, గడియారం చూసింది. తొమ్మిదయిందే! స్కూలుకు పోవాలి! మనసు అన్నం మీదికి పోవడంలేదు. ఆకలసలే లేదు. నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ వంటయింట్లోకి వచ్చింది మణి. జయమ్మగారు వెనక్కు తిరిగి చూచి, "కాళ్లు ఈడ్చుకుంటూ రావద్దని ఎన్నిసార్లు చెప్పానే మణీ. ఆడపిల్ల కుండవలసిన లక్షణాలు ఒకటీలేవే నీకు"అంది. మణిపీటవేసుకుని కంచం కడుక్కుని, మంచినీళ్లు పెట్టుకుని కూర్చుంది. తన తల్లి ఏమంటున్నదో వినే స్థితిలో లేదు. మనసంతా వికలమైపోయింది.

"ఏమిటే అలా వున్నావు, ఎప్పుడూ దిగాలుగా వుండకపోతే ఖులాసాగా వుండరాదటే?" మణిరెండేసి మెతుకులు కతకడం మొదలుపెట్టింది.

"విన్నావుటే జయమ్మా నీ కూతురి మెట్టవేదాంతం? ఈ కొంపలో ఒక్క నిముషం నేనుండలేనమ్మా. నాకూతురి దగ్గర కెడతాను. మారాజమ్మ నిక్షేపంలా అన్ని సౌకర్యాలూ చూస్తుంది. పెళసరపు మాటలూ, మూతి విరుపులూ ఏమీ లేకుండా పోతాయి. సుఖంగా కృష్ణా రామా అంటూ కాలం వెళ్లబుచ్చుకుంటాను. ఆపిల్ల నెత్తుకో మన్నందుకే ఇంత రాద్ధాంతమైంది? రేపు నామతిచెడి ఇంకేదేనా పని చెప్తే, గొంతు పిసికి అవతల పారేస్తారు. నా పిచ్చికానీ ఆరెండు ఇంగ్లీషుముక్కలు నేర్చుకుంటే మాలాంటివాళ్లు కన్పిస్తారా? వాళ్ళ అమ్మా, నాన్నా వుండగా నేనెవర్ని చెప్పడానికి? ఇంతెందుకమ్మా నాకొడుకొచ్చేక చెప్పి పోతాను, అయినా వాడికేమిటి చెప్పేది నా వెర్రికాని." మంగమ్మ చెవికోసిన మేకలా అరుస్తూ వెళ్లి బయట అరుగుమీద కూర్చుంది.

జయమ్మకు ఇది వినేసరికి అరికాలిమంట నెత్తికెక్కింది. "మణీ నీ లాంటి తెలివితక్కువదాన్ని నేనెక్కడా చూడలేదే? ఎన్నిసార్లు చెప్పాను పెద్దవాళ్లతో పోట్లాడకూడదని? ఒకర్ని చూసేనా నేర్చుకోవు. ప్రక్కింటి వాళ్లరాజ్యలక్ష్మిచూడు ఎంత బుద్ధిగా వుందో. ఆ పిల్లను చూస్తుంటే ముచ్చటేస్తుంది. ముఖంలో ఎప్పుడూ లక్ష్మి తాండవమాడుతూ వుంటుంది. మన మొహాన ఒక్కరోజైనా సంతోషం వుందిగనుకనా? చదవంగానే సరా? ఆ లక్ష్మికి ఏమంత గొప్ప చదువొచ్చు? అసలు ఎక్కువ చదువుకుంటేనే చెడిపోతున్నారుతే. లక్ష్మికి ఏం నేర్పించారుగనక, అంత తెలివితేటలు! జాకెట్లు కుడుతుంది. బనీనులు అల్లుతుంది, లేసులు అల్లుతుంది,పాటలుపాడ్తుంది. రామాయణం, భారతం,ఎంతచక్కగా చదువుతుంది. దమ్మిడీ ఖర్చుకాకుండా ఆడపిల్ల చేయాలిసిన పనులన్నీ నేర్చుకుంది. అన్ని విధాలా ఆ లక్ష్మి బాగుపడ్తోంది. మన కారాతవుండాలిగా! నెలనెలా బోలెడంత డబ్బుపోసి ఆ చదువు వెలగబెడ్తూంటే మాట్లాడటమే చేతగాకపోతే మిగిలిన వేమి చేస్తావు? మీనాన్నగారికేనా చెప్పాలి, ఈవెధవ చదువుమాన్పించమని. అప్పుడు కాని తిక్క కుదరదు. నాకుచేతికి కొంత సాయంగా వుంటావు." జయమ్మ మణికి బుద్ధులు గరిపి అత్తగారిదగ్గర కెళ్లి, "దాని

మాటలకేం లెండి, మీరు చెప్పిన పని చేసేస్తాను, అప్పుడుకాని బుద్ధివచ్చేట్టు లేద"ంటూ, ప్రక్కనే కూర్చుంది.

మణి చెవులు గింగురుమన్నాయి. ఇప్పటిదాకా నాయనమ్మగోల, తరవాత అమ్మగోల. ఎవరో పొగుడుతూ, తన్ను తిడుతూంటే ఎవరి మనసొప్పుకొంటుంది? మణిమాత్రంఓర్చుకో గలిగింది. కాని చదువు మాన్పించేస్తారుట. అదే ఓర్చుకోలేని బాధ. "ఏమైనా సరే నీ చదువుమాన్పించేస్తాను," అన్న అమ్మ మాటలు పదేపదే జ్ఞాపకానికొచ్చి హృదయంలో వ్యథకలిగింది. తర్వాత ఏం చెయ్యాలి? ప్రశ్నరాగానే స్పృహతప్పినట్లయింది. మంచినీళ్లు త్రాగాలని గ్లాసు ఎత్తుతూంటే జారి అన్నంలో పడింది. నీళ్లన్నీ అన్నంలో దొర్లాయి, చప్పుడు విని జయమ్మలోపలికొచ్చి, పిచ్చిదానిలా వున్న మణినీ, నీళ్లుకలిసిన అన్నమూ చూసేసరికి జయమ్మకు జాలివేసింది. ఇంతకుముందు తనన్న మాటలు గుర్తుకొచ్చాయి. మణి హృదయంలో చెలరేగుతున్న తుఫాను వెంటనే కనిపెట్టేసింది ఆ మాతృహృదయం. మనసంతా పశ్చాత్తాపముతో నిండిపోయింది. జాలిగా "మణీ"అంది. మణి తలెత్తి చూసి మళ్లీ వంచేసింది.

గబగబా లేచి కంచంలో అన్నంపక్కకేసి, కంచం కడిగి తెచ్చి ఇంట్లోపెట్టి, పీట ఎత్తి, ఇల్లు తుడిచేసి బరువైన హృదయంతోవెళ్లి తనగదిలో కుర్చీలో కూలిపోయింది మణి. జయమ్మకు ఏమనడానికీ నోటెంట మాటరాలేదు. అలా శూన్యంలోకి చూస్తూవుండిపోయింది.

"అక్కయ్యా ఇంకెప్పుడూ చెప్పనే" విచారంగా అన్నాడు మురళి.

"నీదేం తప్పుంది మురళీ, తప్పంతా నాదే".

"అక్కయ్యా నువ్వెంత మంచిదానివి. నన్నించేకదూ, అందరూ నిన్ను తిట్టారు. స్కూలుకు టైమైంది నువ్వెళ్ళవూ"

"నేను మంచిదాన్ని కదూ? అవును అందరూ అదే అంటున్నారు, నీవు తప్ప. బలేవాడివిరా" మణిమందహాసం చేసింది.

"అదేంటి, అక్కయ్యా" మణికళ్లలోకి బెదురుగా చూశాడు మురళి."

?ఏం లేదురా, నాస్కూలుకేంగాని నువ్వుపోలేదేం?"

"లెక్కలు చెయ్యకపోతే మాస్టారుకొడతారనిపోలేదక్కయ్యా?"

"నే లెక్క చెప్తే వెళ్లే వాడివికదూ? నాయనమ్మ చెప్పింది నిజమే. నన్నించే నీ చదువు పోతోంది."

"అక్కయ్యా అవేం పిచ్చిమాటలు"

"ఒరే మురళీ అన్నానికి రారా" జయమ్మ కేక వేసింది. మురళి వెళ్లిపొయ్యాడు.

గోడగడియారం అరగంట కొట్టింది. స్కూలుకుపోవాలి. ఎలాపోవడం? బలహీనంగావుందే? పోకపోతే ఇంకా ఏవైనా తిట్లు మిగిలితే అవి కూడా తిని పోవాలి. "ఏమైనా సరే నీ చదువు మాన్పించేస్తాను."

అన్న అమ్మ మాటలు గుర్తుకొచ్చాయి. ఎవరో తన్ని హింసిస్తున్నారు. వాళ్లెవరో తన్ను బ్రతకనివ్వరు. చదువుమానేస్తే? కళ్లుతిరిగాయి. తలటేబుల్ మీదకువొరిగింది. సరస్వతీ దేవి పటానికి వేసిన మల్లె పూలమాలటేబుల్ మీద పడింది. మణి మాలను చేతిలోకి తీసుకుని, కళ్లకద్దుకొని పటానికి వేసింది. దీనంగా సరస్వతీ దేవిని చూసింది. తను నవ్వుతూన్నా, ఏడుస్తున్నా, ఆ తల్లి నాకేమన్నట్లు నవ్వుతూ వీణవాయిస్తూ వుంటుంది. తన విచారం, కష్టం, చదువు, బాధ, ఏడ్పు ఆమెకు వినిపించవు. "ఏమైనా సరే చదువు మాన్పించేస్తాను" అన్న మాటలుకూడావినిపించవా? తనకే ఆమాటలు బాధను కలిగిస్తాయి, మరెవ్వరికీ కష్టాన్ని కలిగించవు తన నాయనమ్మకుమాత్రం సంతోషాన్నిస్తాయి. 'ఇంతేనా నీ దయ' అన్నట్టుగా సరస్వతీ దేవి కళ్లలోకి చూసింది మణి.

పది గంటలు కొట్టింది. మణి పుస్తకాలు తీసుకోపోయింది. "చదువుమానేస్తున్నావు. మాతో నీకే మవసరం? మమ్మల్ని తాకకు, నీలాంటివాళ్లు మమ్మల్ని ఉపయోగిస్తే మా గౌరవం పోతుంది" అని అంటున్నట్లు కన్పించాయి.

లేనిబలం తెచ్చుకుని, పుస్తకాలు తీసుకుని నిలుచుంది. కళ్లు చెమ్మగిల్లాయి. అశ్రువులు తెలియకుండా రాలుతున్నాయి. కాళ్లు తేలిపోయాయి. చేతిలోని పుస్తకాలు జారిపొయ్యాయి. పడమటిగాలి జోరున వీస్తోంది. గోడకు తగిలించిన సరస్వతిపటం ఒక్కవూపులో క్రిందపడి ముక్కలు ముక్కలైంది. మల్లె పూలమాల మీదపడింది. మాల వురిత్రాడులా కన్పించింది. కెవ్వన కేకేసి పడిపోయింది మణి. గడియారం పదకొండు కొట్టింది. అమ్మా వాళ్లు చూడకుండా లేవాలనుకుంది. కాని ఓపికలేదు. విరిగిన మనసూ, పగిలిన పటమూ, తెగిన మాల కన్పిస్తున్నట్లైంది. సరస్వతీ పటం పడిపోవడం తన చదువుపోయిన దానితో సమానం. అన్నీ అశుభాలే. అబ్బా! అరమోడ్పుకన్నులతో నేలనంటుకొని పడివుంది. మళ్ళీ గాలి జోరున వచ్చింది. కుర్చీ మణికాలుమీద పడింది.

"అమ్మా"పెద్దగా అరిచింది మణి. గుమ్మంలో రిక్షా ఆగిన చప్పుడైంది. భోజనానికి ఆఫీసునుంచి నాన్నగారొస్తున్నారు. ఏమిటని అడిగితే ఏంచెప్పాలి. నెమ్మదిగా కుర్చీ అవతలకు నెట్టింది. తల నొప్పిగా వుంది. కళ్లు తిరిగాయి, ప్రాకుతూ కుర్చీ దగ్గరచేరింది. రామారావుగారు అరుపువిని, ఆదుర్దాగా లోపలకొచ్చి, మణిని చూసి ఆశ్చర్యపొయ్యారు. గదంతా కలయచూశారు. పితృప్రేమ పెల్లుబికింది. విషాదంగా "మణీ" అన్నారు. మణి పలకలేదు. కుర్చీలో కూర్చోపెట్టారు.

"ఏమిటమ్మా ఇదంతా, అలావున్నావేం? స్కూలుకు పోలేదేం'' ప్రశ్నల వర్షం కురిపించారు. మణి "నాన్నా" అంటూ ఆగిపోయింది.

"వీళ్లంతా ఏరి? నువ్విలావుంటే ఒక్కరేనా రాలేదూ? మురళీ! మురళీ! కేకేశారు" రామారావు. వేపచెట్టుకింద గోలీకాయ లాడుకొంటున్న మురళి పరుగెత్తుకుంటూ వచ్చి చూసి, "అక్కయ్యా నన్నించే కదూ నీకీ అవస్థ పట్టింది" అన్నాడు దీనంగా. మణి చిన్నగా నవ్వి "ఎందుకురా, అలా వాపోతావు, నాకేం బాధలేదులే. నువ్వసలేం చేశావు గనక? తప్పంతా నాదే" బుజ్జగిస్తూ అంది.

రామారావుగారికి అర్థంగాక అయోమయంగా అన్నారు— "నాయనమ్మ అమ్మా, భారతీ ఏరీ? ఎక్కడ కెళ్లారు?"

"ప్రక్కింటివాళ్ల రాజ్యలక్ష్మి రామాయణం చదువుతూంటే వినడానికి వెళ్లారు, నాన్నగారొస్తే చెప్పమన్నారు. అక్కయ్య స్కూలుకెళ్లిందనుకుని వేపచెట్టుకింద ఆడుకొంటున్నాను" బిక్కమొహం పెట్టి భయపడ్తూ చెప్పాడుమురళి.

"అసలుసంగతి చెప్పరా" కఠినంగా అన్నారు రామారావు. జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు చెప్పేశాడు మురళి. రామారావు కళ్లు పెద్దవిచేసి, పళ్లు పట పట కొరికారు "ఓరేయ్ మీ అమ్మా వాళ్లను పిలుచుకురారా" కోపంగా అన్నారు. మురళి నెమ్మదిగా లేచాడు. రామారావుగారికి ఏదో జ్ఞాపకానికొచ్చి, "మురళీ ఈ రూపాయితీసుకుని ఏవేనా పండ్లుతీసుకురారా" అన్నారు. మురళి డబ్బు తీసుకొని జేబులో వేసుకొన్నాడు.

జయమ్మను చూసి రామారావు ఉగ్రుడైపోయారు. ఎన్నిసార్లు చెప్పాను, చదువు విషయం తలపెట్టవద్దనీ, పనిచెప్పవద్దనీ? బుద్ధిలేదూ?

ఇద్దరూ కలిసిదాన్ని చంపేస్తున్నారు. మీరు మణిని బ్రతకనివ్వరు. మణి చదవడమే మీకిష్టంలేదు. చదువంతా నాశనం చేస్తున్నారు. ప్రొద్దస్తమానం మీ తిట్లతోటే సరిపోతుంది." కోపంలో ఏదేదో అనేస్తున్నారు రామారావు. జయమ్మకేం అర్థం కాలేదు. కుర్చీలో వాలిపోయివున్న మణిపై దృష్టి మళ్ళింది. భర్త మాటలు లెక్క చెయ్యకుండా ఒక్క వుదుటున మణిని హృదయానికద్దుకొంది. తల్లిప్రేమ మణి కర్థమైంది. తల్లికళ్ళల్లోకి చూస్తూ "అమ్మా" అంది. జయమ్మకు ఉదయం జరిగిన సంఘటన కళ్ళ ముందు గిర్రున తిరిగినట్లయింది. అన్ని తిట్లు తిన్న మణిమనస్సెట్లావుండాలి? కోపంలో తానేదేదో అనేసింది. "నిన్నేమి అనను మణీ" తల నిమురుతూ అంది జయమ్మ.

రామారావుగారి కోపం, పటాపంచలైంది. అన్నిటికీ కారణం తన తల్లి అని అర్థమైంది. మణి హృదయానికి శాంతి కలిగింది. తన చదువు గురించి ఇంట్లో ఎంతగోలయింది! తండ్రి తెప్పించిన బిస్కట్లు, బత్తాయి పండు తింది. గడియారం పన్నెండు గంటలు కొట్టింది. ఈపూట స్కూలుకు పోవాలి. మురళి క్రిందపడిన పుస్తకాలన్నీ తీసి మణి కిచ్చాడు. మణి పుస్తకాలు డ్రాయరులో పెట్టి టైమ్ టేబుల్ చూసి పుస్తకాలు తీసుకుని కూర్చుంది. జయమ్మ ఈ పూట వద్దులే అనాలనుకొని, మళ్లీ సర్దుకుని, "ఏమండీ అన్నానికిరండి" అంది. రామారావు దొడ్లోకిపోయి కాళ్లుచేతులు కడుక్కుని వంటింట్లోకొచ్చి పీట మీద కూర్చున్నారు. గంట పన్నెండే. ఇప్పుడు పోతే స్కూలు వదలరు. మధ్యలో పోవాలి. స్కూలుకు పోయే తోవలో స్నేహితురాలు సూర్యప్రభ ఇంటికిపోతే? బాగుంటుంది. సూర్యప్రభ వచ్చేక ఇద్దరూ కలసి వెళ్ళొచ్చు. అప్పటిదాకా వాళ్లరేడియో పెట్టుకోవచ్చు.

స్కూలుకు పోవాలని నిర్ణయానికొచ్చి "మురళీ నేను స్కూలు కెళ్లానని చెప్పరా" అంటూ అడుగులో అడుగువేస్తూ పుస్తకాలు చేతబట్టి గడప దాటింది మణి. మురళి అక్కయ్య కు చూస్తూ వుండిపోయాడు.

"రామాయణం ఎంత బాగాచదివిందే లక్ష్మి. మనింట్లో ఆమాత్రం రామాయణం చదివి వినిపించలేరుగా? నా మనుమరాలు చదువుతోందనడానికి సిగ్గేస్తోంది." దొడ్లో అరుగు మీదకూర్చుంటూ మంగమ్మ సాగతీసి చెబుతున్నమాటలు జయమ్మా, రామారావూ విన్నారు.

"నేనేం చేయనండీ! తప్పంతా నాదేనంటారు. ఆవిడ నేమన్నా అంటే కోపం వస్తుంది. మణి నేమన్నా అంటే అది బాధపడ్తుంది. మధ్యలో ఇరుక్కుచస్తున్నాను." అత్తగారికి వినపడుతుందేమో నన్నట్లు నెమ్మదిగా చెప్పింది జయమ్మ.

రామారావుగారు అసలే ముక్కోపి. తల్లిగారి మాటలు వినేసరికి ఆగ్రహం వచ్చి, తినే తినే అన్నం వదిలేసి దొడ్లోకొచ్చి చెయ్యి కడుక్కున్నారు. జయమ్మ ఏమీ అనలేక చూస్తూ నిల్చుండి పోయింది.

కొడుకుని చూసి, "ఒరే రాముడూ నా మాట విని నా గమణిని స్కూలు మాన్పించరా. అది బాగుపడ్తుంది. వాళ్ళ రాజ్యలక్ష్మి చూడరా ఎంత మంచిపేరు తెచ్చుకుందో?" తనపట్టే నెగ్గాలన్నట్లుగా అంది మంగమ్మ.

"దానిచదువుమాట ఎత్తొద్దని ఎన్నిసార్లు చెప్పాను. నాకూతుర్ని నేనెట్లయినా చేసుకుంటాను నా యిష్టం. పెద్దదానవైనకొద్దీ, బుద్ధి మారుతూందేం? మీ కంతకష్టంగా వుంటే దానికి వేరే రూమ్‌చూసి అక్కడే అన్ని ఏర్పాట్లూచేసి చదివిస్తాను. ఇదే నా నిశ్చయం. ఇంకెప్పుడేనా దాని చదువు మాట ఎత్తేరంటే ఆ పని చేసితీరుతాను. నీ కంతగా వినాలనివుంటే మణికి ఫిడేలు నేర్పిస్తాను. అంతేగాని దాని చదువుమాత్రం మాన్పించను ఎంతవరకు చదివితే అంత వరకూ చదివిస్తాను. మణి చదువే మింగయ్యేదులే మన డబ్బంతా. డబ్బంతా చదువుకవుతోందని కదూ మీకీ కుళ్లు?"

కోపానంతా కక్కేసి రామారావు త్వరత్వరగా హాల్లో కెళ్లి కుర్చీలో కూర్చున్నారు. "నాన్నా! అక్కయ్య స్కూలుకెళ్ళానని చెప్పమంది" అన్నాడు మురళి.

తాంబూలం తెచ్చి టేబిల్ మీద పెడుతూ, "మణి ఏదండీ"అని అడిగింది జయమ్మ.

తాంబూలం వేసుకుంటూ "మురళితో చెప్పి స్కూలు కెళ్లిందట." అన్నారు.

"అప్పుడే ఏం బడండీ పన్నెండేగా గంట?"

"స్కూలుకెళ్ళేతోవలో కృష్ణమూర్తి గారింటికి వెళ్తుంది. వాళ్ళమ్మాయి సూర్యప్రభ, మణీ క్లాస్ మేట్స్."

"ఓహో! కృష్ణమూర్తిగా రమ్మాయా? వాళ్లకు 60 ఎకరాలున్నాయిట, రేడియో కూడా వుంది, తల్లిలేదుగా పాపం? అన్నీ వాళ్ళ అక్కయ్యే చూస్తుంది. మొన్న దసరాలకు పేరంటాని కెళ్లినపుడు చూశాన. ఫిడేలుకూడా నేర్చుకుంటోంది. ఆ రోజు పాడింది. మణి చాలఉబలాటపడిందిఫిడేలు నేర్చుకోవాలని. కాని మళ్లీఎప్పుడూ ఆమాట ఎత్తనేలేదు ఎందుచేతోగాని. గోడ కానుకుని కూర్చుంటూ అంది జయమ్మ."

"ఆచదువే సాగనివ్వరు మీరు, ఇంక ఫిడేలు నేర్పిస్తారాఅనుకోనుంటుంది. మణిది చాల తెలివైన బుర్ర. దాన్ని బాగా చదివిస్తే తప్పక మనకు మంచిపేరు తెస్తుంది. ఈమధ్య మీగోల వినలేక మనోవ్యాధి పట్టుకుంది. మొహంచూస్తే తెలియడంలేదూ? కృష్ణమూర్తి గారితో మాట్లాడి, ఫిడేలు ఏర్పాటుచేస్తాను. ఏమంటావు?"

"అలాగేనండీ"

మణి నేరుగా సూర్యప్రభ యింటికి వెళ్లింది. ఫిడేలు వాయిస్తున్న ప్రభనుచూసి ఆశ్చర్యంతో "స్కూలు కెళ్ళలేదా ప్రభా?" అంది. ఫిడేలు క్రింద పెట్టి మణినిహాల్లోకి తీసుకుపోయింది ప్రభ. "మార్నింగ్ నువ్వొస్తావని చూస్తూ వుండిపొయ్యాను. ఎంతకీ రాలేదు, లేటుగా పోవడ మెందుకని మానేశాను మణీ..."

"నన్నించి నువ్వు కూడ మానేశావన్న మాట! ఏమీ తోచక ఫిడేలు వాయిస్తున్నావు అంతేనా ప్రభా?" అంది మణి.

రెండుగంటలకి మణీ ప్రభా బుజాలమీద చేతులేసుకుని స్కూలుకి వెళ్లారు. సగం దూరంపోయేసరికి స్కూల్లో, టంగ్ టంగ్ మని గంట కొట్టారు. గబగబా వెళ్లి క్లాసులోవాళ్ళ వాళ్ల సీట్లలో కూర్చున్నారు. హిందీ మాష్టరమ్మ వచ్చి హిందీ చెప్పి వెళ్లింది. మణికి ఒక్కటీ అర్థం కాలేదు. మనసు పరిపరివిధాల పోతోంది. తనెందు కిలాబాధపడాలి? ఏదోతనకు తెలియనిబాధ రగులుతోంది. అటు చెప్పలేక ఇటు చెప్పలేకతల్లి విచారిస్తోంది. అన్నిటికీ తనే కారణం. కళ్ళలో నీరు తిరిగింది. కళ్ల నీళ్ళను అణచడానికి ప్రయత్నించింది. అదిస్కూలన్న విషయం జ్ఞాపకానికొచ్చింది తనకుతానే సిగ్గుపడింది. మణి చాలా బాధపడ్తోంది. ప్రాణస్నేహితురాలుగా ఎంచుకుంటున్న మణి బాధపడ్తూంటే ఓర్చుకోలేక పోయింది ప్రభ. మణి బాధ ఏమిటో ప్రభ కర్థంకాలేదు. అడిగితే రెచ్చగొట్టినట్లవుతుందేమో? ఏమిచెయ్యాలి? ప్రొద్దున స్కూలుకు రాకపోవడానికి, మణి బాధకు సంబంధం వుండాలి. మునుపటిలా ఇంట్లో ఏమైనా అన్నారా? అయితే అయివుండాలి. లెక్కల మేష్టారొచ్చారు. రెండు లెక్కలు హోమువర్కుకు ఇచ్చి మొన్నటివీ ఈరోజువీ రఫు లెక్కలపిరి

(54-వ పేజీ చూడండి)

నాగమణి చదువు

(19-వ పేజీ తరువాయి)

యడ్‌లో చేసి చూపించండి అన్నారు బెల్ కొట్టారు సైన్సు పీరియడ్ మాష్టారు సెలవు పెట్టారు. "ఈ వేళకి మిమ్మందరినీ ఇంటికి వెళ్ళమని హెడ్‌మాష్టారు చెప్పారు" అని ప్యూన్ చెప్పాడు. మొగపిల్లలంతా ఎగిరి గంతేశారు అందరూ ప్లేగ్రౌండులో కెళ్ళి ఆడుకొంటున్నారు క్లాసులో ఎనిమిది మంది ఆడపిల్లలు మాత్రం మిగిలారు

"ఏంచేస్తున్నారు? ఈపీరియడ్ మీకు సెలవేగా" అంటూ మేష్టారమ్మ వచ్చింది అందరూ లేచి నిల్చున్నారు మణి కుర్చీ తెచ్చి మేష్టారమ్మ దగ్గర వేసింది నవ్వుతూ కూర్చుంది మేష్టారమ్మ. అందరి మొఖాలూ చిన్నబోయాయి. మణి ముఖంలో కళాకాంతి లేకపోడం చూసి బాధపడింది ప్రభ

"అమ్మగా రేదో పనిమీద వచ్చారే" తమాషాగా అంది మణి

"మేష్టారమ్మ చెప్పింది ప్రభా! నీవు చెప్పావే మొన్న ఇంటర్‌వెల్‌లో టీచర్స్ రూమ్‌లో ఆ "నాటకం" వేయించాలనుకుంటున్నాను దాంట్లో మీరు ఇద్దరూ రాణిస్తారని నాకు తెలుసు ఈ నాడు ఆడపిల్లలంతా చదువు నేర్చుకోవాలి. ఆడవాళ్ళకు చదువెందుకు అనే మాట రూపుమాపాలి దాన్నే నాటకంగా వేద్దాం ఏం? మునుపు వేసిన నాటకాలు రక్తికట్టలేదు ఈ నాటకం ఆకర్షించేట్టుగా తయారుచేయాలి మీ అభిప్రాయం చెప్పండి అన్నీ నేను రెడీ చేస్తాను, మీరు స్టడీ చెయ్యండి రేపు చెప్తాను ప్రోగ్రాం"

మేష్టారమ్మ వెళ్ళిపోయింది మణికి మరచిన గాథ జ్ఞాపకానికొచ్చింది తన ఇంటిదగ్గర జరిగేదేగా? మళ్ళీ ఇంటికిపోతే ఏం జరుగుతుందో, అనుభవం వుంది గనుక ఆ నాటకంలో తను తప్పక రాణిస్తుంది అసలు తనకంత స్వేచ్ఛ ఎక్కడిది? మణి ఆలోచనా తరంగాలలో కొట్టుకు పోతోంది. మాకేంపని అనుకుంటూ అందరూ వెళ్ళిపోయారు

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటీ చికిత్స, క్యాటలాగు ఉచితం జి వి రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) 'భాస్కరాశ్రమము' గోపాలపురం, తూ గోదావరి.

ప్రభ మణిని పరీక్షించి జాలిగా "నీవేదో బాధపడ్తున్నావ్ మణీ! నాకు చెప్పవూ "అంది

"నే నేం బాధపడ్డం లేదే" అంది చిన్నగా నవ్వుతూ "నీ కలా కన్పడుతున్నానా ప్రభా"

"నువ్వు నాదగ్గర దాచిపెట్టాలని చూస్తున్నావు నాకు చెప్పవా మణీ"

తను బాధపడ్డమేగాక తోటి స్నేహితురాల్ని కూడ కష్టపెట్టాలిసొచ్చినందుకు చాల విచారమేసింది మణికి తనంటే ప్రభకు అంత ప్రేమ ఎందుకో? వాళ్ళ అక్కయ్యకూడా తనను ఎంత ప్రేమగా చూస్తుంది! వీళ్ళకు చెప్పక, తన మనోవ్యథ నెవరికి చెప్పాలి? బంధువులైనా నమ్మకూడదు కాని, స్నేహితుని నమ్మవచ్చు అని తన తల్లి ఎన్నిసార్లు చెప్పలేదు!

"నా చదువుగురించే ఈ బాధ. ఇంట్లో నా చదువుగురించి పెద్దగోల జరుగుతోంది మా నాన్న నన్ను చదివించాలంటున్నారు మా నాయనమ్మ మాత్రం నన్ను చదవనీయకూడదని పట్టుబట్టి నన్ను బాధపెడ్తోంది. మా అమ్మ మాన్పించడమా చదివించడమా అని సంకోచిస్తోంది నన్ను చదువు మాన్పిస్తారని భయంగావుంది ప్రభా నన్నే చదువు మాన్పిస్తే నీవు నన్ను మర్చిపోతావా?"

కళ్లలో నీళ్లు జలజలారాలిపోతున్నాయి.

"ఏమిటా పిచ్చిమాటలు మణీ? నిన్ను మరచిపోగలనా, నిన్ను చూడకుండా వుండగలనా నీవలా దుఃఖపడుతూంటే నేను చూడలేను మణీ"

మణి చెప్పింది, "నేను బాగా చదివి, స్త్రీల బానిసత్వాన్ని బాపి అందరూ చదుకోవాలని ప్రచారం చేసి, సంఘంలోని అజ్ఞానాన్ని నిర్మూలించాలనుకున్నాను కాని వీళ్లు అవకాశం యివ్వలేకున్నారు నా ఆశలన్నీ నాశనమయ్యాయి నా గాలి మేడలు కూలిపోయాయి నువ్వే నా ఆదర్శ స్నేహితురాలివి ప్రభా"

"నాకు తెలుసు మణీ" నీ మనసు మార్చుకోకు నేనూ మా అక్కయ్యా నీకు తోడ్పడతాము నీవు నాకంటె చిన్నదానివైనా, నీలోని భావాలు నాకంటె పెద్దవి నీవు బాధపడితే లాభం లేదు ఓర్పుతో అన్నికష్టాలను నేర్పుతో ఎదుర్కొని సంఘాన్ని బాగుచేయాలి మణి"

బెల్ కొట్టారు మణి, ప్రభ పుస్తకాలు తీసుకుని వీధిలోకొచ్చారు ఆలోచిస్తూ నడచిపోతుంటే ప్రభ యిల్లు వచ్చింది ప్రభ వెళ్లిపోయింది మణి మెల్లిగా నడుస్తూ ఇల్లు చేరింది.

మురళి బలే సంతోషంగా, "అక్కయ్యా, నీకు ఫిడేలు తెచ్చారే నాన్నగారు! రేపట్నించీ మాష్టారుచేత ఫిడేలు నేర్పిస్తారుట అమ్మ పిండివంటలు చేసిందే" అంటూ మణికి స్వాగతమిచ్చాడు

"ఉన్న చదువుకి ఇంత రాద్ధాంతమవుతోంది ఇంక ఫిడేలు తెస్తారు! అంతా అబద్ధం" మణి పుస్తకాలు టేబుల్ మీదపెట్టి కుర్చీలో కూర్చుని తల టేబుల్ మీద ఆనించి కూర్చుంది మురళి మంచినీళ్ళు తెచ్చి అక్కకిచ్చి వేరే కుర్చీలో కూర్చుని, అన్నాడు. "నిజంగానే అక్కయ్యా నాన్నగారు నీ సంగతి ఎత్తితే వేరే రూమ్ మాసి చదివిస్తానన్నారు ఆమాట వినేసరికి నాయనమ్మ కుక్కిన పేనులా వుండిపోయిందే! అమ్మా, నాన్నా నువ్వేడ్చినందుకు దిగులుపడ్డారే నన్నించే నీకు ఫిడేలు వచ్చిందే నాకు బాగా పాడి వినిపిస్తావుకదూ" సంతోషంతో చెప్తున్నాడు మురళి

మణి హృదయంలో దుఃఖం తొలగి సంతోషం చేరింది ఆశ్చర్యంగా సరస్వతీదేవి పటం చూసి, "మురళీ పటం ఎప్పుడు కట్టించారురా?" అంది.

"ఫిడేలుకొనటానికి కెళ్లేటప్పుడు పటం తీసుకెళ్లి అద్దం వేయించి తెచ్చారే రావే నాన్నగారి గదిలోకెళ్లి ఫిడేలు చూద్దాం" మణిని లాక్కుపోయ్యాడు నాన్నదగ్గరకు మురళి

"చెప్పకుండా నే పోయావేమ్మా? ఈరోజు నీకోసం ఫిడేలు తెచ్చాను, రేపట్నించీ నేర్చుకుందువుగాని ఏవేవో వాళ్లు వాగుతూంటే నీ వెందుకమ్మా బాధపడడం? వెర్రిదానా, నేనుండగా నీ చదువు మాన్పిస్తానా?" కూతుర్ని చూసి అన్నారు రామారావు

మణి ఫిడేలుచూసి ఆశ్చర్యపోయింది వృధాగా బాధపడ్డానే అనుకుంది ప్రక్క నే కుర్చీలో కూర్చుని, "నాన్నగారూ మా మేష్టారమ్మ మాచేత నాటకం వేయిస్తానంటున్నారు నేను నాటకంలో పాత్ర వెయ్యడానికి అమ్మావాళ్లు ఒప్పుకుంటారో లేదో" నాన్న ఏమంటాడో అనుకుంటూ, నేలనురాస్తూ అడిగింది మణి

"వాళ్ల నడానికీ, నాటకంలో పాత్రవేస్తే తప్పేముందమ్మా. వాళ్ల మాటలకేం. నా అభ్యంతరం లేదు. కృష్ణమూర్తిగారమ్మాయి సూర్యప్రభకు చెప్పే మాష్టారే నీకు ఫిడేలు నేర్పేది. నేను పార్కుకెళ్తానుమణీ" అంటూ రామారావుగారు పైకండువా వేసుకుని వెళ్లిపోయారు.

మురళి, మణి అమ్మ దగ్గర కెళ్లి పీట వేసుకుని కూర్చున్నారు. జయమ్మ

రెండు ప్లేట్లలో పకోడీలు, జాంగ్రీలు తెచ్చి పెట్టింది. సంతోషంగా మణి, మురళి తిని వేపచెట్టుకింద ఆడుకొంటున్న పిల్లలదగ్గర కొచ్చారు. మురళికూడ ఆటల్లో చేరాడు. తొట్టిలోవున్న గులాబీమొక్క పువ్వులు పూసిందేమో అని చూసింది మణి. పువ్వులులేవు వాళ్ళ ఆటలుచూస్తూ నిల్చుంది. భారతి "అక్కా, అక్కా" అంటూ చేతులెత్తుతోంది మణి భారతి నెత్తుకుని, గదిలోకొచ్చి పాటలు పాడుకుంటోంది ఉల్లాసంగా స్నానంచెయ్యమని చెప్పడానికొచ్చిన జయమ్మ మణి సంతోషంగావుండడం చూసి మురిసిపోయింది.

మరుచటి రోజే ఫిడేలుపాఠాలు ఆరంభమైనాయి. ప్రారంభోత్సవానికి ప్రభనీ, వాళ్లఅక్క సుందరినీ, తరవాత మేష్టారమ్మనీ ఆహ్వానించింది మణి జయమ్మ అందరికీ కాఫీ ఫలహారాలు ఇచ్చి మర్యాద చేసింది. హాల్లో అందరూ కుర్చీల్లో కూర్చున్నారు "ఆనాటకమేమిటో చెప్పండి అమ్మగారూ" అంది మణి. మేష్టారమ్మని.

"ఆనాటకం పేరు 'నాగమణి' చదువు

ఈ నాటకం మీలాంటి గరల్స్ కు చాలా ఉపయోగకరమైంది. ఈ నాటకం నిన్ను గురించే వెయ్యాలని బుద్ధి పుట్టింది. నీ విషయం సూర్యప్రభ చాలాసార్లుచెప్పింది. ఇప్పుడు నీకాకష్టం తీరిపోయింది. కాని, నీలాంటివాళ్లు ఇంకా ఎంతమందో బాధపడుతున్నవాళ్లున్నారు వాళ్ళకోసమైనా మనం పాటుపడాలి హెడ్ మాష్టారుగారు వచ్చేఆదివారం నాటకం జరిపేందుకు ప్లాను వేశారు రేట్లు తేలికగా ఉండాలన్నాను. లేకపోతే అందరూ చూడలేరు. కథ సారాంశమేమిటంటే; ఒక బాలిక చదువుకోవాలనే కుతూహలంతో స్కూల్లో ప్రవేశిస్తుంది. ఇంట్లో నాయనమ్మ, మేనత్త, ఇరుగుపొరుగువాళు అడ్డం పెడ్తారు తల్లి కూతురి కోర్కె తీర్చలేక, అత్త, ఆడబిడ్డల పోరు పడలేక బాధపడ్తుంది. ఓర్పుతో అలా కష్టపడుతూ ఫస్ట్ మార్కులు తెచ్చుకుని, జీతంలేకుండా చదివి, ఆపైన దేశసేవచేసి ప్రఖ్యాతి తెచ్చుకుంటుంది ఈ కథలో నాయికపాత్ర నువ్వేధరించాలి సూర్యప్రభ తల్లిపాత్ర, సుందరి ఆడబిడ్డపాత్ర, లలిత, రాధ, ఇరుగుపొరుగువాళ్ల పాత్రలు, హెడ్ మాష్టారు, స్కూలుమాష్టారు పాత్ర, నేను నాయనమ్మ పాత్ర, మీ క్లాస్ మేట్సు అందరూ స్కూలుపిల్లల పాత్రలువేయడానికిమాష్టార్లంతా ఏర్పాటు చేశాము. మీరందరూ బాగానటిస్తే తప్పక నాటకం రక్తి కడుతుంది. సమాజంలోని వక్రభావాలు పోతాయి. గరల్స్ హైస్కూల్స్ వృద్ధిపొందుతాయి." మేష్టారమ్మ చెబుతూంటే అందరూ శ్రద్ధతో విన్నారు. సమ్మతిని తెల్పారు.

ఆదివారంనాడు సాయంకాలం స్కూలంతా ప్రేక్షకులతో నిండిపోయింది. కృష్ణమూర్తిగారు, సుందరి, జయమ్మ, మంగమ్మ, రామారావుగారు, వుచితంగా వేంచేశారు అనుకోకుండాస్కూలు

ఇన్స్పెక్టరుగారు వచ్చారు నాటకం వేస్తున్నారని తెలిసి చాల సంతోషించారు. స్కూలు అభివృద్ధికై పాటుపడుతున్న మాష్టార్లను చాలా మెచ్చుకున్నారు మాష్టార్లంతా ఇన్స్పెక్టరుగారికి మర్యాదలు చేశారు "నాగమణి చదువు" నాటకం ఆరుగంటలకు మొదలుపెట్టారు. తెరవిడిపోయింది కథానాయకి మణి పుస్తకాలు చేతబట్టి దిగులుగా కూర్చున్నట్లుగా మొదలయింది. నాయనమ్మ ఈసడింపులు, మేనత్త ఎత్తిపొడుపులు, ఇరుగుపొరుగుల గుస గుసలు, గోల, మనసులోని బాధను ఓర్చుకుని, శ్రద్ధతో చదువుతున్న ఆ అమ్మాయి బాధను మణిస్పష్టంగా నిరూపించి, ఆబాలగోపాలం మనసును కరిగించింది మణిని అర్థంచేసుకో లేకపోయానుకదా అని పశ్చాత్తాప పడింది మంగమ్మ మంగమ్మలాంటి వాళ్ళందరో బుద్ధి తెచ్చుకున్నారు. మేనత్త గయ్యాళితనం బాగా చూపింది సుందరి. నాయనమ్మ కోపాన్ని ఈర్ష్యను తెలిపింది మేష్టారమ్మ. కూతురికోర్కె తీర్చలేక బాధపడ్తున్నట్లుగా నటించింది ప్రభ హెడ్ మాష్టారికి, స్కూలుమాష్టారు పాత్ర అలవాటే నాటకం చిన్నది గనుక పదిన్నరకి పూర్తయింది నాటకంలో పాత్రధరించినవాళ్లంతానమస్కరించారు ప్రేక్షకులకు.

తరవాత ప్రభా, మణీ ఫిడేలు వాయించారు ప్రేక్షకులంతాహర్షధ్వనులు చేశారు ఇద్దరికీస్కూలు ఇన్స్పెక్టరుగారు బంగారు పతకాలు బహుమతి నిచ్చారు

కూమార్తెల ప్రజ్ఞను చూసి సంతోషంతో కృష్ణమూర్తిగారు, రామారావుగారు, నాగమణికి, సూర్యప్రభకు పూలమాలలు వేశారు కూతురి ప్రతిభను చూసి జయమ్మ, మనుమరాలి చలాకీతనాన్ని చూసి మంగమ్మ, చెల్లెలి నేర్పును చూసి సుందరి మురిసిపోయారు మేష్టారమ్మ స్టేజీ ఎక్కి మణి ప్రభలను మెచ్చుకుంటూ, తమ స్కూలుకు పేరుతెచ్చారంటూ ఒక చిన్న ఉపన్యాస మిచ్చి ఆశీర్వదించింది. ఇదే "నాగమణి చదువు" నాటకము. ★

రు 1000 బహుమానం
లెపర్స్ క్యూర్
(రిజిష్టర్డు)
కుష్టు, బొల్లి, సుఖరోగాదులకు
గ్యారంటీ చికిత్స.
అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.
లక్ష్మి అండ్ కో
(రిజిష్టర్డు)
H O వాల్తేరు, ఆర్. యస్.
బ్రాంచీలు:
2/135 బ్రాడ్వే, మదరాసు.
గాంధినగర్, విజయవాడ.
కటక్, సికింద్రాబాదు,
రాజమండ్రి etc.

నపుంసకతైలం
అంగ నరములు బలహీనతచెంది చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది
1సీసా రూ 10/కల్లార్గ్ వి పి రూ 1-0-0.
ఆర్డరుతో రు 1/- పంపవలెను.
డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్
మలకపేట బిల్డింగ్స్,
హైద్రాబాద్, దక్కన్

ఒక గంటలో యౌవ్వనము
కామస్తంభన
దాతుపుష్టి సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది నిరాశచెందిన వృద్ధులయందు శక్తి ఉత్సాహము నిచ్చును రు 2-8-0
మదన మంజరి ఫార్మసీ
184, చైనా బజారురోడ్డు, మద్రాసు
బెజవాడ-శ్రీనివాస మెడికల్ ఏర్పు పార్కు రోడు రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడు నెల్లూరు ఆర్యన్ ఫార్మసీ.